మెళవాయిలో మరో చిరుత మృతి

భయాందోళనలో గ్రామస్తులు




మృతి చెందిన చిరుత కళేబరం

ప్రజాశక్తి-మడకశిర రూరల్


మడకశిర మండలం మెళవాయి గ్రామంలో మరో చిరుత కళేబరాన్ని అటవీశాఖ అధికారులు గురువారం ఉదయం గుర్తించారు. బుధవారం నాడు గ్రామ సమీపంలో ఓ ఆడ చిరుత కళేబరాన్ని అధికారులు గుర్తించిన విషయం తెలిసిందే. గురువారం ఉదయం ఆ ప్రాంతంలో పరిశీలనకు వెళ్లిన అధికారులకు అక్కడ మరో మగ చిరుత కళేబరం లభ్యం అయ్యింది. రెండు రోజుల వ్యవధిలో ఇక్కడ రెండు చిరుత కళేబరాలు లభ్యం అయ్యాయి. అయితే ఈ రెండు చిరుతలు కూడా మంగళవారం రాత్రే మృతి చెందినట్లు అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. మృతిచెందిన రెండు చిరుతల వయస్సు 18 నెలలు ఉంటుందని అటవీశాఖ అధికారులు తెలిపారు. చిరుతలు మృతి చెందిన ప్రాంతాన్ని జిల్లా ఫారెస్ట్ అధికారి రవీంద్రనాథ్ రెడ్డి, పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ అమర్నాథ్ రెడ్డిలు గురువారం ఉదయం సిబ్బందితో కలిసి పరిశీలించారు. రెండు చిరుతల విష ఆహారం తినడం వల్ల మృతి చెందాయా..? లేక అనారోగ్యంతో మరణించాయా.? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు వారు చెప్పారు. ఈ ప్రాంతంలో మృతి చెందిన వాటి తల్లి చిరుత కూడా సంచరించే అవకాశం ఉన్నందున గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు. కాగ చిరుతల సంచారంతో మేళవాయి సమీప గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కొండ ప్రాంతానికి దగ్గరగా ఉన్న ఈ గ్రామంలోకి వణ్యప్రాణులు వచ్చే అవకాశం ఎక్కువగానే ఉంటోంది. ఈ క్రమంలో బుధ, గురువారాల్లో వరుసగా రెండు చిరుతలు మృతి చెందడంతో ఆ గ్రామస్తులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆయకట్టు 'కలే'నా..?

- హంద్రీనీవా మొదటి విడతకు అందని నీరు
- దశాబ్ధకాలంగా నీరొస్తున్న ఆయకట్టుకు నీరులేదు



హంద్రీనీవా కాలువ (ఫైల్ ఫొటో)



ఆయకట్టు భూమి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

హంద్రీనీవా మొదటి దశ కింద ఆయకట్టుకు నీరు కలగానే మిగిలిపోతోంది. 2012 నుంచి ఏటా శ్రీశైలం నుంచి అనంతపురం జిల్లాకు హంద్రీనీవా ద్వారా నీరొస్తూనే ఉంది. దశబ్ధకాలం దాటినా మొదటి దశ కిందనున్న ఆయకట్టుకు నీరందించే పంటకాలువల నిర్మాణం మాత్రం పూర్తవలేదు. ఇప్పటికీ భూసేకరణ వద్దనే ఆగిపోయి ఉంది. మరోవైపు కొత్తగా ఈ ప్రాజెక్టు కింద నీటి కేటాయింపులు పెరిగిపోతూనే ఉన్నాయి. కాని ప్రాజెక్టు రూపకల్పన సమయంలోనే నిర్ణయించిన ఆయకట్టుకు నీరందించే పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది.

మొదటి దశ కింద 1.18 లక్షల ఆయకట్టు ప్రతిపాదన

హంద్రీనీవా మొదటి దశ కింద 1.18 లక్షల ఎకరాల ఆయకట్టును ప్రాజెక్టు రూపకల్పన సమయంలోనే నిర్ణయించారు. ఈ ప్రాజెక్టుతోపాటు పంటకాలువల నిర్మాణం చేపట్టాలన్నది లక్ష్యం. మొదటి దశ కింద శ్రీశైలం మాల్యాల నుంచి జీడిపల్లి వరకు ఉంటుంది. ఇంతదూరం వరకు 2012వ సంవత్సరం నుంచి నీటిని తీసుకొస్తూనే ఉన్నారు. సగటున 20 టిఎంసిలకుపైగానే నీరు ఏటా వస్తోంది. పంట కాలువల నిర్మాణం చేపట్టేందుకుగానూ ప్యాకేజీ 33, 34, 36–ఎ, 368 ప్యాకేజీలున్నాయి. ఇందులో ప్రధానంగా ఉరవకొండ ప్రాంతంలోనే సాగునీటిని అధికంగా అందించేందుకు వీలుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలంటే హంద్రీనీవా కింద కలిపి మొత్తం రూ.917 కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనా రూపొందించారు. ఈ నిధులు విడుదలయిన తరువాత భూసేకరణ చేపట్టాక పనులు పూర్తి చేస్తామని చెబుతున్నారు. అయితే ఇప్పటికి ఇది పూర్తవుతున్నది మాత్రం తెలియని పరిస్థితి నెలకొంది. ఫలితంగా కళ్లేదుటే నీరు పోతున్నా ఆయకట్టుకు వాడుకోలేని పరిస్థిత రైతుల్లో నెలకొంది. దీనిపై సిపిఎం ఆధ్వర్యంలో గతంలో పెద్దఎత్తున ఆందోళనలు సైతం నిర్వహించారు. ప్రతిపక్షంలో ఉండగా వైసిపి నాయకులు సైతం ఈ ఆందోళనలో పాల్గొన్నారు. కాని అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో దీనిపై కదలిక లేదు.



గుంటూరు కాంచిపురం మురగన్ శిల్క్ షాపు గుమస్తాతో మాట్లాడుతున్న నాయకులు

గుంటూరు శిల్క్ షాపు గుమస్తా నిర్బంధం

బకాయిలు చెల్లించాలంటున్న వ్యాపారులు

15 రోజుల్లో బకాయిలు చెల్లిస్తామన్న యజమాని

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

గుంటూరుకు చెందిన కాంచిపురం మురగన్ శిల్క్ షాపు గుమస్తా శ్రీకాంత్‌ను ధర్మవరం పట్టుచీరల వ్యాపారులు గురువారం పట్టుకుని బంధించారు. నెలక్రితం విజయవాడలో ధర్మవరం పట్టుచీరల వ్యాపారులపై దాడి జరిగిన విషయం తెలిసిందే. దీంతో ధర్మవరం పట్టుచీరలవ్యాపారులు ఆందోళన చేపట్టడంతోపాటు వివిధ రాజకీయ పార్టీలనాయకులు కూడా తీవ్రంగా ఖండించారు. దీంతో విజయవాడ ఘటన తెలుగురాష్ట్రాల్లో సంచలనం రేకెత్తించింది. దీంతో ఆలయ శిల్క్ యజమానిపై పోలీసు అధికారులు చర్యలు కూడా చేపట్టారు. దీంతో అప్రమత్తమైన ధర్మవరం పట్టుచీరల వాప్యారులు అసోషియేషన్ ఏర్పాటుచేసుకుని వివిధ ప్రాంతాలలో ఉన్న బకాయిలను చట్ట ప్రకారమే వసూలు చేయడానికి శ్రీకారం చుట్టారు. గుంటూరుకు చెందిన కాంచిపురం మురగన్ శిల్క్ షాపు యజమాని వంశీవర్మ ధర్మవరం పట్టుచీరల వ్యాపారులకు రూ.3 కోట్ల దాకా అప్పు ఉన్నాడు. విడతల వారిగా ఇప్పటి వరకు రూ.1.50 కోటి బకాయి చెల్లించారు. ఇంకా రూ.1.50కోటి వరకు బకాయి ఉంది.ఆ మొత్తం ఇవ్వకుండా దాదాపు 10నెలల నుండి తిప్పుకుంటున్నారని ధర్మవరం పట్టుచీరల వ్యాపారులు చెబుతున్నారు. ఈ నేపథయంలో ఆ షాపు గుమస్తా గురువారం పట్టుచీరల కోసం ధర్మవరానికి వచ్చాడు. దీంతో ఆయనను చూసిన పట్టుచీరల వ్యాపారులు పట్టుకుని ధర్మవరం వ్యాపారుల అసోషియేషన్ ప్రతినిధుల వద్దకు పిలుచుకుని వెళ్లారు. ధర్మవరం వ్యాపారులకు ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని, మీ యజమానిని పిలిపించాలని గుమస్తా పై ఒత్తిడితెచ్చారు. దీంతో ఆ గుమస్తా వారి యజమానితో మాట్లాడి 15 రోజులలో బకాయిలు చెల్లిస్తామని చెప్పారు.



ఉత్తమ అధికారిగా అవార్డు తీసుకుంటున్న కమిషనర్ బండిశేషన్న

కమిషనర్‌కు అభినందనలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ధర్మవరం మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుమ్మనూరు జయరాం, కలెక్టర్ అరుణ్‌బాబు చేతులమీదుగా బండి శేషన్న అవార్డు అందుకున్నారు. అవార్డు తీసుకున్న శేషన్నకు ధర్మవరం మున్సిపల్ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో మెరిసిన 'పురం' విద్యార్థులు

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర స్థాయిలో ఈ నెల 13న ఆదివారం విశాఖపట్నంలోనిస్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో స్పోర్ట్స్ కరాటేడో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో హిందూపురానికి చెందిన ఏడుగురు విద్యార్థులు ప్రతిభ కనపరచినట్లు కరాటే మాస్టర్ ఫైరోజ్ తెలిపారు. సత్తా చాటిన విద్యార్థులను గురువారం కరాటే మాస్టర్ అభినందించి సర్టిఫికెట్లను అందించారు. పట్టణంలోని పాంచజన్య పాఠశాలకు చెందిన నేహా, హిందూపురం రూరల్ మండలం చిన్నగుడ్డంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ధనుష్ ప్రథమ స్థానాలను సాధించారన్నారు. దీప్తి స్కూల్ విద్యార్థి కౌశిక్, లోటస్ స్కూల్ విద్యార్థి జాన్ విక్టర్ తృతీయ స్థానాలతో విజయం సాధించారన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రాల తనిఖీ

ఓబుల దేవర చెరువు : మండల పరిధిలోని గాజుకుంట పల్లి,కొండకమర్ల ఆరోగ్య ఉపకేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి ఎస్వీ కృష్ణారెడ్డి తనిఖీ చేశారు. గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధాన కార్యక్రమం అమలును వైద్యాధికారి డాక్టర్ భానుప్రకాష్ ను అడిగి తెలుసుకొన్నారు.కొండకమర్ల ఆరోగ్య ఉపకేంద్ర పరిధిలోని ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ కమల్ రోహిత్, క్షమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సుభాషిని, ఆరోగ్య విస్తరణ మరియూ పర్యవేక్షకులు గఫూర్, గోపి నాయక్, లక్ష్మి నరసమ్మ, ఎంఎల్‌హెచ్‌పితో పాటు ఆరోగ్య, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు దూరంగా పేద విద్యార్థిని

ప్రజాశక్తి - కదిరి టౌన్

చదువులో చిన్నప్పటి నుండి ప్రతిభ కనపర్చిన విద్యార్థిని నీట్ జాతీయ ఎలిజిబుల్ ఎంట్రన్స్ పరీక్షలో అర్హత సాధించింది. అయినప్పటికీ కాలేజీలో చేరడానికి ఆర్థిక స్తోమత లేక ఇంటి దగ్గర ఉండిపోయింది. తనకల్లు మండల కేంద్రం అంబేద్కర్ నగర్‌కు చెందిన కీర్తి ఇంటర్మీడియట్ లో మంచి మార్కులు సాధించింది. తను డాక్టర్ కావాలనే లక్ష్యంతో శిక్షణ లేకుండానే నీట్ రాసి మెడిసిన్ లో మంచి ర్యాంకు సాధించింది. కీర్తికి తిరుపతి పద్మావతి మెడికల్ కాలేజీలో సీటు ఖరారు కాగా సీటుకొరకు రెండు లక్షల రూపాయలను ముందస్తుగా చెల్లించాల్సి వచ్చింది. రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేద కుటుంబానికి చెందిన కీర్తి ఆర్థిక ఇబ్బందులతో అంత డబ్బు చెల్లించలేకపోయింది. కీర్తి తండ్రి తనకల్లులో పెయింటింగ్ ఆర్టిస్టుగా జీవనం సాగిస్తున్నాడు. కీర్తి చదువుకు ఆర్థిక స్తోమత లేక ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తూ ఉన్నారు దాతలు ముందుకొస్తే వైద్య విద్యను అభ్యసించి ప్రజా సేవ చేయాలనుందని కీర్తి చెబుతోంది.

30న సామూహిక గృహప్రవేశాలు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా॥జవహర్ రెడ్డి



వీడియో కాన్ఫిరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఆగస్ట్ 30న రాష్ట్ర వ్యాప్తంగా సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం ఉంటుందని ఈ మేరకు జిల్లాలో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా॥జవహర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం సంబంధిత కార్యదర్శులతో కలిసి ఏపీ సెక్రటేరియట్ నుంచి వర్చువల్ విధానంలో వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టపర్తి కలెక్టరేట్ స్పందన వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్, పెనుగొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఒ కొండయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ 2023 ను అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో మిల్లెట్స్ రాగులు, జొన్న కొర్ర తదితరాలను పండించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 25వేల ఎకరాలలో రైతులు రాగి పంట విస్తీర్ణంగా పండిస్తున్నారని చెప్పారు. రాగి పంట విస్తీర్ణపై రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. జిల్లాలో రీ సర్వే రెండవ విడతలో భూముల రీ సర్వే పూర్తి అయిన వాటిలో రాళ్ళు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నామన్నారు. అనుకున్న లక్ష్యం మేరకు గృహ నిర్మాణ పనులు ముందుకుసాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రచార పర్వం





వైసిపి నాయకులు వేర్వేరుగా చేస్తున్న ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-హిందూపురం

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికార వైసిపి, ప్రతి పక్ష టిడిపిలు హిందూపురం రూరల్ మండలం చలవెందుల గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. దీంతో గత మూడు రోజుల పాటు హోరాహోరీగా ప్రచారాలు నిర్వహించాయి. దీంతో పాటు ఇరు పార్టీల వారు ఓటర్లను ప్రసన్నం చేసుకోవాడానికి ప్రలోభాల పర్వానికి తెరలేపారు. టిడిపి వారు ు ఓటుకు రూ.1000 ఇస్తే వైసిపి వారు రూ.1000 నుంచి 1500 రూపాయల వరకు ఇవ్వడంతో పాటు చీరలను సైతం పంపిణీచేస్తున్నట్లు వార్తలు వినపిస్తున్నాయి.

హిందూపురం రూరల్ మండలం చలివెందుల గ్రామ పంచాయతీ సర్పంచి సౌభాగ్యమ్మ అనారోగ్యంతో గత ఏడాది మృతి చెందారు. దీంతో ఆ పంచాయతీకి ఈ నెల 19న ఎన్నికలు జరుగుతున్నాయి. ఎన్నికల పర్వంలో భాగంగా గురువారంతో ప్రచార పర్వం ముగిసింది. ఈ ఉపఎన్నికకు ఎటువంటి పార్టీ గుర్తులు లేకపోయినప్పటికీ ఇటు అధికార పార్టీ వైసిపి, ప్రతిపక్ష పార్టీ టిడిపి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. గత మూడు రోజుల నుంచి హోరాహోరీగా ప్రచారం సాగిస్తూ విజయంపై ఎవరు అంతకు వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇరు పార్టీల వారు ఓటర్లను ప్రసన్నం చేసుకోవాడానికి అవసరమైన అన్ని ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. నగదుతో పాటు చీరలను పంపిణీ చేపట్టినట్లు తెలిసింది. గతంలో జరిగిన ఎన్నికల్లో హిందూపురం రూరల్ మండలంలో 14 గ్రామ పంచాయతీల్లో వైసిపి 10 చోట్ల జెండా ఎగురవేసింది. టిడిపి 4 పంచాయతీల్లో తక్కువ మెజార్టీతో తన సత్తా చాటుకుంది. అయితే గతంలో ఇన్‌ఛార్జిగా ఉన్న ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ కాలంలో ఆ ఎన్నికలు జరిగాయి. అయితే పార్టీ అతన్ని తప్పించి దీపికకు ఇన్‌చార్జ్ భాధ్యతలను అప్పగించింది. దీంతో దీపిక ఈ ఎన్నికల్లో ఏలాగైన గెలిచి తమ సత్తా ఏంటో చూపించాలని ప్రయత్నం చేస్తున్నారు. దీనికన్నా ముందే ఏకగ్రీవం చేసుకోవాడానికి అధికార పార్టీ వారు టిడిపి అభ్యర్థికి పెద్ద మొత్తంలో ఆశ చూపించినట్లు విశ్వసనీయ సమాచారం. అది కుదరక పోవడంతో ఎన్నికల్లో ఓటర్లను ఏలాగైన ప్రసన్నం చేసుకోవడానికి రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. అదే విధంగా టిడిపి వారు కంచుకోటలో తమ సత్తా ఏంటో నిరూపించుకోవాలని ప్రయత్నం చేస్తున్నారు. దీంతో ఇరు పార్టీల నాయకులు పెద్ద ఎత్తున ప్రచారాలు నిర్వహించారు. మొత్తానికి ఎంతో పటిష్టాత్మకంగా సాగనున్న చలివెందుల సర్పంచి ఉప ఎన్నికల్లో పట్టు నిలుపుకోవాలని టిడిపి, పట్టు సాధించాలని వైసిపి తహతలాడుతున్నాయి ఎవరికి విజయం ఎవరికి వరిస్తుందో 19వ తేదీ సాయంత్రం వరకు వేచి చూడాల్సిందే. ఇదిలా ఉండగా సర్పంచి అభ్యర్థి గెలుపు ఓటములపై అంతర్గతంగా భారీ ఎత్తున పందేలు కూడా జరిగినట్లు మండలంలో వార్తలు వినిపిస్తున్నాయి. అయితే అధికారులు ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందికి గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

మొదలైన ప్రలోభాలు

అధికార పార్టీలో తగ్గని విభేదాలు

ప్రచారంలోను తగ్గని విబేధాలు

హిందూపురం మండలం చలివెందుల పంచాయతీ ఉప ఎన్నికల్లోనూ అధికార వైసీపీలో వర్గపోరు వీడలేదు. ఎవరికి వారు వర్గాలుగా విడిపోయి వైసీపీ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం చేస్తున్నారు. పార్టీ పెద్దలతో మార్కులు వేయించుకోవడానికే ప్రచారంలో పాల్గొని మమ అనిపిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గెలుపు మాట దేవుడెరుగు అటెండెన్స్ మాత్రం వేద్దాం అన్నట్టుంది వీరి వ్యవహారం. హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు గ్రూపులను ఏకతాట పైకి తీసుకురావడానికి వైసిపి అధిష్టానం ఎంత ప్రయత్నించినా అది సాధ్యం కావడం లేదు. ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్ ఉప ఎన్నిక ప్రచారానికి దూరంగా ఉన్నారు. రామకృష్ణారెడ్డి సోదరి మధుమతి రెడ్డి ప్రచారం చేస్తున్నారు. హిందూపురం వైసీపీ ఇన్‌ఛార్జి దీపికతో కలిసి ప్రచారం చేస్తున్నప్పటికీ అంటీముట్టినట్టు వ్యవహరిస్తున్నట్లు ప్రచారం సాగుతుంది. దీపికతో కలిసి మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, ముఖ్య నాయకులు కలిసి ప్రచారం చేస్తున్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైసిపి యువజన జిల్లా అధ్యక్షులు వాల్మీకి లోకేష్ వారికి మద్దతుగా ఉన్నారు. కౌన్సిలర్లు, నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. వైసిపిలో గ్రూపుల కారణంగా సర్పంచి అభ్యర్థి గెలుపు పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

28న వడ్డెర్ల నిరసన ర్యాలీ

గోరంట్ల : వెంకటరమణ పల్లెలోని వడ్డెర్లపై జరిగిన దాడిని ఖండిస్తూ ఈనెల 28న నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు వడ్డెరసంఘం నాయకులు తెలిపారు. పట్టణంలోని మాధవ రాయిని గుడి ప్రాంగణంలో గురువారం వడ్డెర సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు అంజనప్ప మాట్లాడుతూ 11వ తేదీ జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈదాడిని ప్రతి వడ్డెర సోదరుడు తన కుటుంబ సభ్యులపై జరిగినట్లుగా భావించి సమైక్య భావంతో పోరాటానికి ముందుకు రావాలన్నారు. వడ్డెర ఫెడరేషన్ మాజీ చైర్మన్ దేవల్ల మురళి మాట్లాడుతూ వెంకటరమణ పల్లిలో జరిగిన దాడిని అనాగరికమని అన్నారు. పార్టీలకు అతీతంగా సంఘాలకు అతీతంగా వడ్డెర్లందరూ కలసికట్టుగా 28వ తేదీ గోరంట్లలో నిర్వహించే శాంతి ర్యాలీకి తరలిరావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన అధ్యక్షులు డాక్టర్ తిరుపతేంద్ర, పల్లపు జయచంద్ర, మోహన్, పరిగి హనుమయ్య, వెంకటగిరి పాలెం శ్రీనివాసులు, కుంచపు పెద్దన్న, మహిళా అధ్యక్షురాలు అంజలి, స్థానిక నాయకులు అంజినప్ప, అమర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మహాశక్తి చైతన్య యాత్ర

కనగానపల్లి : తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాశక్తి చైతన్య యాత్ర రాప్తాడు నియోజకవర్గంలో కొనసాగుతోంది. గురువారం కనగానపల్లి మండలం కెఎన్ పాళ్యం గ్రామంలో మహిళా నేతలు ఈ యాత్రను చేపట్టారు. మినీ మ్యానిఫెస్టోలో మహిళలకు సంబంధించిన పథకాలను ప్రజలకు వివరించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి లక్ష్మీదేవి,హిందుపురం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి రామసుబ్బమ్మ, కనగానపల్లి మండల అధ్యక్షురాలు రాములమ్మ, అనితమ్మ, తదితరులు పాల్గొన్నారు.

డీలర్ వైఖరిపై తహాశీల్దార్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి గుడిబండ

మండలంలోని శంకర గల్లు రేషన్ షాప్ నంబర్ 16, 39కు సంబందించిన డీలర్ల పనితీరుపై గ్రామస్తులు స్థానిక తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. షాప్ నెంబర్ 16కు చెందిన డీలర్ కార్డు లబ్ధిదారులకు పంపిణీ చేసే దాదాపు 13 కింటాళ్ళ బియ్యాన్ని స్వాహా చేశాడని ఆరోపించారు. దాదాపు 21 ఒక్క కుటుంబాల కార్డు లబ్ధిదారుల నుంచి వేలిముద్ర వేయించుకొని టోకనులు ఇచ్చి బియ్యం ఇవ్వకుండా ఇంటి చుట్టూ తిప్పుకుంటున్నాడని ఫిర్యాదుచేశారు. అదేవిధంగా షాప్ నంబరు 39 లో కూడా దాదాపు 6 క్వింటాళ్ల బియ్యాన్ని కార్డు లబ్ధిదారులకు ఇవ్వకుండా డీలర్ స్వాహా చేశారనట్లు బాధితులు తహాశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ రెండు షాపులపై విచారణ చేపట్టాలని డిప్యూటీ తహాశీల్దార్ ఆర్ఐను ఆదేశించారు. మండల పరిధిలోని నాచేపల్లి చిగతుర్పి, రాళ్లపల్లి, పలారం, హిరేతుర్పి మందలపల్లి, కరికెర తదితర గ్రామాల్లోని ఎఫ్ఇ షాపుల్లో ఇదే తంతు జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదన్న ఆరోపించారు. గ్రామాల్లో ప్రజల కోసం ప్రభుత్వం అమలుపరిచిన ప్రజా పంపిణీ వ్యవస్థ నిర్వీర్యం అవుతుందని గ్రామాల్లో విద్యావంతులు, ప్రజలు, కార్డు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ప్రతి షాపులోనూ కార్డు లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులు లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకొని ఇలాంటి పునరావృతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

వార్డు మెంబర్ అభ్యర్థికి మద్దతుగా 'బికె' ప్రచారం

ప్రజాశక్తి - గోరంట్ల

గోరంట్ల మేజర్ గ్రామపంచాయతీ 18 వ వార్డు ఉప ఎన్నిక ఈనెల 19న జరుగనుంది. ఈసందర్భంగా టిడిపి మద్దతుతో బరిలో ఉన్న అభ్యర్థి శ్రీకాంత్‌కు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే పార్థసారథి గురువారం సింగిరెడ్డిపల్లి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. అభ్యర్థి శ్రీకాంత్‌కు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ సోమశేఖర్, పార్లమెంటు టిడిపి కార్యదర్శి దేవా నరసింహులు, మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థ రెడ్డి, నీలకంఠ రెడ్డి, వేణు రాయల్, ప్రభాకర్, చౌడేశ్వరి కాలనీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 15 లోపు పంటనమోదు పూర్తి

ప్రజాశక్తి గుడిబండ

మండల వ్యాప్తంగా 2023 ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు సెప్టెంబర్ 15 లోపు సంబంధిత అధికారులు పంట నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని మండలవ్యవసాయ అధికారి వీర నరేష్ అధికారులకు సూచించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో గురువారం గ్రామ రెవెన్యూ అధికారులకు, రైతు భరోసా కేంద్రం అధికారులకు, పంట నమోదు, పంట కోత ప్రయోగాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతుల పొలాలను పంట నమోదు చేయడంతో పాటు పంటకోత ప్రయోగాలను కూడా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ నాగభూషణ, ఎంఎఒ డిటి, ఎఎస్ఒ, ఎఇఒలు, రైతులు పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్ర భవిష్యత్తు

మడకశిర :టిడిపితోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని టిడిపి నియోజకవర్గ పరిశీలకులు పార్థసారథి రెడ్డి తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని రొళ్ల మండలం హోట్టేబెట్ట గ్రామంలో టిడిపి నాయకులతో కలసి ఇంటింటికి తిరిగి టిడిపి ప్రకటించిన మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ దాసిరెడ్డి, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి , విశ్రాంత ఇంజనీర్ మల్లికార్జున, కృష్ణమూర్తి, కాంతరాజు తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ మృతికి సంతాపం

మడకశిర : పట్టణ సమీపంలోని బేగార్లపల్లి గ్రామంలోని మాజీ కౌన్సిలర్ గంగాధర స్వామి బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సుధాకర్, ఈరన్న మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. గంగాధర్ చేసిన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు.

గ్రంథాలయం తనిఖీ

గుడిబండ : జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమాదేవి గురువారం గుడిబండ గ్రంథాలయ కార్యాలయాన్ని బుధవారం తనఖీ చేశారు. పిల్లల పరిస్థితిపై గుడిబండ గ్రంథాలయ శాఖ అధికారి కమలనాబారావును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె గ్రంథాలయంలోని అన్ని రికార్డులను పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు.

లక్ష్యాలను అధిగమించాం

పుట్టపర్తి రూరల్: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని మండలంలో 100 శాతం పూర్తి చేసినట్టు వైద్యాధికారి డాక్టర్ నాగరాజు నాయక్ పేర్కొన్నారు. పుట్టపర్తి మండల పరిధిలోని పెడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యార్థులకు నులి పురుగులు నివారణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ, నగేష్, సూపర్‌వైజర్లు చంద్రకళ, సరస్వతమ్మ, ఎంఎల్‌హెచ్‌పి రాధ, ఆరోగ్య కార్యకర్త సుస్మిత, ఆశా కార్యకర్త పద్మావతి పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని రక్షించుకుందాం

కదిరి అర్బన్ : రాష్ట్రాన్ని రక్షించుకుందామని సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో పుట్టపర్తి, కదిరి తాలూకా పరిధిలోని మండల కార్యదర్శులు, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్, రైతు సంఘం, ఎఐటియుసి, ఆటో యూనియన్ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా వేమయ్య యాదవ్ హాజరయ్యారు. రాష్ట్రంలో అభివద్ధి అటకెక్కిందని, వ్యవసాయ, పారిశ్రామిక,నీటి పారుదల రంగాలు నిర్వీర్యమయ్యాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కదిరి, పుట్టపర్తి, నియోజకవర్గ కార్యదర్శులు ఇసాక్, ఆంజనేయులు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు

ట్రాఫిక్ సిఐగా శ్యామరావు

ధర్మవరం టౌన్ : ధర్మవరం ట్రాఫిక్ సిఐగా పి.శ్యామరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. పుట్టపర్తి ఎస్పీ కార్యాలయంలో వీఆర్ ఉన్న ఈయన ధర్మవరం ట్రాఫిక్ సిఐగా బాధ్యతలు స్వీకరిం చారు. ఇక్కడ పనిచేస్తున్న వహీదా బాషా మూడు నెలల క్రితం సిఐడి విభాగానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శ్యామరావు మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కారిస్తానని చెప్పారు.

బాధితుడికి వీల్‌చైర్ అందజేత

ధర్మవరం టౌన్ : పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన వేణుగోపాల్‌నాయక్‌కు టీడీపీ నాయకులు గురువారం వీల్‌చైర్ అందజేశారు. 1994లో రోడ్డు ప్రమాదం లో తీవ్రంగా గాయపడి నడవలేని స్థితిలో ఉన్న వేణుగోపాల్‌నాయక్ సమస్యను స్థానికులు పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి వీల్‌చైర్‌ను ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఫణికుమార్, నాగూరుస్సేన్, కేశగాళ్లశీన, చారుగుండ్లఓబుళేశు, కొతపేటఆది, ఇజ్రాయిల్, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికలకు సర్వం సిద్ధం

గాండ్లపెంట : మండల పరిధిలోని మల్ల మీద పల్లి పంచాయతీలోని 9వ వార్డు ఉప ఎన్నికకు సర్వం సిద్ధం చేసినట్లు రిటర్నింగ్ అధికారి సి. సునీత తెలిపారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 19వ తేదీ జరిగే ఉప ఎన్నికల షెడ్యూల్‌ను వివరించారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

కదిరి టౌన్ : శ్రీ సత్యసాయి జిల్లాలో నిఘావిభాగం లో ఇన్స్పెక్టర్‌గా పనిచేస్తున్న విజయకుమార్ అత్యుత్తమ సేవలందించినందుకు అవార్డు అందజేశారు. స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా జోనల్ అధికారి గిడుగు వెంకటేశ్వరరావుచే అత్యంత ప్రతిష్టాత్మకమైన అవార్డును అందుకున్నారు. ఈ నేపథ్యంలో విజయకుమార్ తనిఖీలో భాగంగా కదిరి డిపో కు వచ్చిన సందర్భంగా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ నాయకులు హరిమోహన్, రమణ, బైరిశెట్టి తదితరులు విజయకుమార్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమములో సెక్యూరిటి హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, సిబ్బంది సుంకన్న, శ్రీకాంత్, అసోషియేషన్ సభ్యులు డి.లక్ష్మీనారాయణ, బాష, భాస్కర్, షఫీ, ప్రసాద్, బయన్న, గంగిరెడ్డి, క్రిష్ణా తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : ఉత్తమ డాక్టర్ గా అవార్డు తీసుకున్న డాక్టర్ ఐనుద్దీన్‌ను మండల వైద్యసిబ్బంది గురువారం సన్మానించారు. వైద్యాధికారి డాక్టర్ నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో పీహెచ్సీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ రామచంద్రారెడ్డి, పిహెచ్ఎన్ భారతి, సూపర్వైజర్లు సుధాకర్, రెడ్డమ్మ, లక్ష్మీదేవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలోని జిల్లా పరిషత్ సెంట్రల్ హై స్కూల్ లో పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్న కె. నాజినిన్ బేగం ఉత్తమ అవార్డు పొందింది. ఈ సందర్భంగా గురువారం పాఠశాల వద్ద ప్రజా సంఘాలు, అధికారులు ఆమెను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివ శంకరప్ప, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ, హెచ్ఆర్‌సి నాయకులు కురుబ నంజుండప్ప, ఎంఆర్‌పిఎస్ నాయకులు రామాంజనేయులు, తిమ్మాపురం నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వరిగి : ఉత్తమ ఎస్‌ఐగా అవార్డు అందుకున్న స్థానిక ఎస్ఐ నరేంద్రను, డివిజన్ స్థాయిలో అవార్డు పొందిన తహశీల్దార్ సౌజన్యలక్ష్మిని ఎంఆర్‌పిఎస్ నాయకులు గురువారం సన్మానించారు. విధినిర్వహణలో వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, నాగరాజు, నరేష్, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

సమానపనికి సమాన వేతనం ఇవ్వాలి





కదిరి, హిందూపురంలో నాయకులు, కార్మికుల నిరసన



పుట్టపర్తిలో మానవహారం

ప్రజాశక్తి - కదిరి టౌన్

మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని మున్సిపల్‌కార్మికసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం స్థానిక అంబేద్కర్ సర్కిల్లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నా వైసిపి ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయం అన్నారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు మున్సిపల్ కార్మికులందరికీ వర్తింపజేయాలని, మున్సిపల్ కార్మికులు ఏదైనా ప్రమాదంలో చనిపోతే నష్టపరిహారం చెల్లించి, వారి కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 24న చలో విజయవాడ కార్యక్రమం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షులు జనార్ధన, జిల్లా కోశాధికారి తిరుపాలు, సూరి, చిన్నకృష్ణ, నరసింహమూర్తి, రామాంజులు, రాజు, సిఐటియు నాయకులు జగన్మోహన్, రామ్మోహన్, ముస్తాక్ అలీ, కృష్ణ నాయక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించక పోతే ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయాలన్ని ముట్టడిస్తామని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి జగదీష్ హెచ్చరించారు. మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనాలు, ఇంజనీరింగ్ విభాగం కార్మికులకు స్కిల్, సెమీస్కిల్ వేతనాలను అమలు, సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు మున్సిపల్ వర్కర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కార్మికులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ సర్కిల్‌లో మానవ హారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు క్లాప్ డ్రైవర్లకు రూ.18500 వేతనం ఇవ్వాలన్నారు. ఎన్నికలకు ముందు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలన నేరవేర్చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, కోశాధికారి ఆనంద్, రామచంద్ర, రామంజప్ప, మంజునాథ్, గుర్నాథ్, చంద్ర, నరసింహమూర్తి, శివ కుమార్, శంకర, నాగేంద్ర, బాబయ్య, బాలాజీ, కవిత, ఓబులమ్మ, క్లాప్ డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : మున్సిపల్ కార్మికులందరిని పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ హనుమాన్ కూడలిలో మానవహారంగా ఏర్పడి కార్మికులు నిరసన తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన చేపట్టారు. సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులందరిని పర్మినెంట్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇంజనీరింగ్ కార్మికులకు యూజీడి కార్మికులకు హెల్త్ రిస్క్ అలయన్స్ ఇవ్వాలని గ్రాడిటీ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు 18500 రూపాయల వేతనం ఇవ్వాలని, పెండింగ్ లో ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన కార్మిక కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే దశలవారీగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, సిఐటియు నాయకులు పైపల్లి గంగాధర్, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు గోవిందు, నాగార్జున, నరసింహులు, సాయి, రామాంజనేయులు, రామయ్య, రమణ, గణేష్, నాగరాజు, పోతలయ్య తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే ప్లాస్టిక్ నియంత్రణ



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ప్లాస్టిక్ నియంత్రణలో ప్రజలందరూ భాగస్వాములు అయ్యేలా కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మీదేవి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్ లో గురువారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ డిగ్రీ కళాశాలల హెచ్ఎంలకు, ప్రిన్సిపాళ్లకు, కరెస్పాండెంట్లకు ప్లాస్టిక్ నియంత్రణపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిస్థాయిలో తగ్గించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు ధర్మవరం పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా చేయాలన్న ఉద్దేశ్యంతో ఈ సమావేశాన్ని నిర్వహించామని తెలిపారు. వెయ్యి కేజీల లోపు ప్లాస్టిక్ ను సేకరించిన వారికి 50 వేల రూపాయలు, వెయ్యి కేజీల లోపు ప్లాస్టిక్ ను సేకరించిన వారికి 20 వేల రూపాయలు నగదు బహుమతి ఉంటుందని వారు ప్రకటించారు. పట్టణ ప్రజలందరూ కూడా ప్లాస్టిక్ నియంత్రణలో భాగస్వాములు అవుతూ పూర్తిగా సహకరించాలని తెలిపారు. సచివాలయ ఉద్యోగులందరికీ కూడా వార్డులవారీగా ఈనెల 23వ తేదీన పట్టణంలోని ప్రభుత్వ బాలుర మైదానంలో ప్లాస్టిక్‌ను సేకరించే కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, సహాయ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు మహబూబ్ బాషా, శాంసన్,ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చాంద్‌బాషా, ధర్మవరం పట్టణ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డ్ నిధులు స్వాహా

కార్యదర్శిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్త చెరువులోని మార్కెట్ యార్డ్ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రంగనాథ్ మార్కెట్ యార్డ్ నిధులను స్వాహా చేశారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. ఈ మార్కెట్‌యార్డ్‌లో ప్రతి బుధవారం గొర్రెల సంతను నిర్వహిస్తున్నారు. సంతనిర్వహణపై కార్యదర్శి ఆధ్వర్యంలో సిబ్బంది పన్ను వసూలు చేస్తున్నారు. ప్రతివారం లక్ష రూపాయల వరకు వసూలు అవుతున్నాయి. అయితే ఆయన కేవలం రూ.20 వేల నుండి 30 వేల రూపాయల వరకు మాత్రమే వసూళ్ల మొత్తాన్ని మార్కెట్ యార్డ్ కు చెల్లించి మిగిలిన మొత్తాన్ని స్వాహా చేస్తున్నట్లు తెలుసుకున్న సిబ్బంది ప్రశ్నించారు. దీంతో కార్యదర్శి సిబ్బందిపై దురుసుగా వ్యవహరించి వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో బుధవారం విజిలెన్స్ అధికారులు, మార్కెట్ యార్డ్ ఏడీ మూర్తి ఆధ్వర్యంలో వసూలు చేశారు. దీనితో ఆయన అక్రమాలకు పాల్పడినట్టు వెల్లడయింది. దీంతో కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఉన్నత అధికారులకు వారు ఫిర్యాదు చేశారు.

మహనీయుల సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి కదిరి అర్బన్

దేశానికి స్వాతంత్రం రావడానికి కృషి చేసిన ఎందరో మహనీయుల సేవలు స్ఫూర్తిదాయకమని స్థానిక ఎమ్మెల్యే సిద్ధారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి 1 సచివాలయం అవరణలో నా మట్టి - నా దేశం నియోజకవర్గ స్థాయి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి ఎందరో నాయకులు కృషి చేశారన్నారు. ప్రజల కొనుగోలు శక్తిలోను, జిఎస్‌డిపి పెంపులో మన రాష్ట్రం అగ్రస్థానంలో ఉంద అన్నారు. అనంతరం నా మట్టి - నా దేశం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన శిలాఫలకం జాతికి అంకితం చేశారు. జాతీయ జెండాను ఎగురవేసి వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి రాఘవేంద్ర డివిజనల్ అభివృద్ధి అధికారి సి. సూర్యనారాయణ , డివిజనల్ పంచాయతీ అధికారి డి అంజనప్ప , కదిరి మండల పరిషత్ అధ్యక్షులు తోట అమరనాథ రెడ్డి, తలుపుల మండల పరిషత్ అధ్యక్షులు మహమ్మద్ రఫీ , గాండ్లపెంట మండల పరిషత్ అధ్యక్షులు టి జగన్మోహన్, స్థానిక సర్పంచి శాంతమ్మ బాయి, వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠ నాయక్ , నియోజకవర్గంలోని అందరు ఎంపిడిఒలు, ఇఒఆర్‌డిలు తదితరులు పాల్గొన్నారు.

'నీట్'లో మెరిసిన లేపాక్షి విద్యార్థులు

లేపాక్షి : మండలానికి చెందిన విద్యార్థులు నీట్ పరీక్షల్లో మెరిసారు. మండలకేంద్రానికి చెందిన జాన్ ప్రకాష్, రాణిమ్మల సంతానమైన జెస్సి ప్రహర్ష రాణి , జాన్ ఎడ్విన్ నీట్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనపర్చారు. ఒకరు తిరుపతి శ్రీ బాలాజీ మెడికల్ కాలేజ్‌లో మరొకరు నంద్యాల మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటును సాధించారు. ఈ విద్యార్థులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి సర్పంచి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

లేపాక్షి : ఖరీఫ్ 2023వ సంవత్సరములో పంట వేసిన రైతులందరూ ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారిని తెలిపారు. ఈ మేరకు ఎఒ గురువారం గలిబిపల్లిలో ఈక్రాప్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి -పెనుకొండ

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంకర్ నారాయణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని మావటూరు పంచాయతీ సత్తార్ పల్లి గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయనతో పాటు ఎమ్మెల్సీ మంగమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివశంకరప్ప,వైసిపి మండల కన్వీనర్ నాగలూరు బాబు , జెడ్పీటీసీ శ్రీరాములు, ఎంపీపీ గీతా రామ్మోహన్ రెడ్డి, స్థానిక సర్పంచి నాగరాజు ఎంపీటీసీ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక చేయూత

ప్రజాశక్తి -పెనుకొండ

పట్టణంలోని ఆల్విన్ కాలనీలో నివాసం ఉంటున్న రవీంద్రనాథ్ కుమారుడు డేనియల్ నాయక్ మెడిసిన్ చదవడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. విషయం తెలుసుకున్న పెనుకొండ లోని కురుబ సంఘం నాయకులు విద్యార్థికి రూ 15వేలను గురువారం అందజేశారు. ఈ మొత్తాన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామాంజనేయులు, పరమేశ్వరప్ప, కొండలరాయుడు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పల్లె ఉమకు పలువురి నివాళి



ముదిగుబ్బలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

పెనుకొండ : పట్టణంలోని శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాలలో పల్లె ఉమా జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పల్లె ఉమా చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిశేష రెడ్డి, కళాశాల ఏవో కేశవయ్య, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గంగాధర్, వైస్ ప్రిన్సిపల్ అశోక్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : బాలాజీ విద్యాసంస్థల మాజీ చైర్మన్, మాజీ మంత్రి పల్లెరఘు నాథరెడ్డి సతీమణి పల్లెఉమ 63వ జయంతి వేడుకలను స్థానిక శ్రీనివాస డిగ్రీ, జూనియర్ కళాశాలలో ఘనంగా జరుపుకున్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ముసల్ రెడ్డి , జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పుష్పవాహనరెడ్డి సమక్షంలో పల్లె ఉమమ చిత్రపటానికిపూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండలంలోని గొట్లూరు అనాథాశ్రమంలో వృద్ధులకు పాలు, బ్రెడ్లు పంపిణీచేశారు.

ముదిగుబ్బ : పల్లె ఉమా జయంతి సందర్భంగా మండల పరిధిలోని జొన్నల కొత్తపల్లి తండా పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు బిస్కెట్లు పంపిణీ చేశారు. అంతేకాకుండా మండల కేంద్రంలోని ఎస్ డి ఆర్ ఆర్ డిగ్రీ కళాశాలలో పల్లె ఉమా చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపల్ ప్రకాష్ రెడ్డి, జొన్నల కొత్తపల్లి తండా హెడ్మాస్టర్ సూర్యచంద్రారెడ్డి , జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సతీమణి పల్లె ఉమా జయంతి వేడుకలను టిడిపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి విద్యారంగంలోనూ రాజకీయంగా ఆమె అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. వృద్ధాశ్రయంలో వృద్ధులకు పాలు పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు శ్రీరామ్ రెడ్డి, సామకోటి ఆదినారాయణ, కోనంకి గంగాధర్ నాయుడు, మాల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం :పల్లె ఉమా జయంతిని సప్తగిరి ఎంబిఎ కళాశాలలో గురువారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం. నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పల్లె ఉమ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కొట్నూరులో ఉన్నా వృద్ధాశ్రమంలో వృద్ధులకు అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జి. శివ శంకర్ రెడ్డి, పరిపాలన అధికారి బి. గంగిరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్. మంజునాథ్, డిగ్రీ వైస్ ప్రిన్సిపల్ ఉపేంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : కొత్తచెరువు లోనే టిడిపి కార్యాలయంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సతీమణి పల్లె ఉమా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణచ టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

నల్లచెరువు : మండల పరిధిలోని జోగన్నపేట వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డుప్రమాదఘటనలో ఇద్దరు మృతిచెందాడు. ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ ప్రమాదంలో మరో పదిమందికి గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు... చెన్నై నుంచి తాడిపత్రి వెళ్తున్న లారీని. మినీ ఐచర్ ఢీ కొంది. మినీ ఐచర్ వాహనంలో వెళ్తున్న బీహార్ కు చెందిన వలస కూలీలు ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఘటనా స్థలంలోనే బీహార్ కు చెందిన హెూరిల్ యాదవ్,(29) మృతిచెందాడు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. అక్కడినుండి కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మరొకరు మృతిచెందినట్లు నల్లచెరువు ఎస్ఐ వరలక్ష్మి తెలిపారు.



మృతుడు హోరిల్‌యాదవ్

పేకాట జూదరులు అరెస్టు

ధర్మవరం టౌన్ : పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3,50,790లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సిఐ రాజా తెలిపారు. పట్టణంలోని చంద్రబాబునగర్ శివారు ప్రాంతంలో ఉన్న కంపచెట్ల మధ్యలో కొంతమంది పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో తన సిబ్బందితో దాడులు నిర్వహించగా ముగ్గురు పారిపోయారన్నారు. మిగిలిన 11 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3,50,790లు నగదుతోపాటు పేకముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు.

నీటమునిగి వ్యక్తి మృతి

చిలమత్తూరు : మండలంలోని వీరాపురం పంచాయతీ వెంకటాపురం చెరువులో చేపల వేటకు వెళ్లిన ముత్యాలు (55) అనే వ్యక్తి ప్రమాదవ శాత్తు నీట మునిగి మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

చీనీచెట్లు నరికేయడం అనాగరికం

బత్తలపల్లి: తాడిమర్రి మండలానికి చెందిన చిన్న గంగన్న అనే పేద రైతు చీనీచెట్లను నరికి వేయడం అనాగరికం అని శ్రీ సత్యసాయి జిల్లా కురుబ సంఘం నాయకులు సామకోటి ఆదినారాయణ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం రైతు పొలాన్ని పరిశీలించారు. బాధిత రైతు చిన్నగంగన్నను పరామర్శించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీనీ చెట్లను నరకడం లాంటి అనాగరిక చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాల జంగాలపల్లి పెద్దన్న, ఉపాధ్యక్షులు మారుతి,సిఐటియు నాయకులు భాష, కాటమయ్య, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నాయకుడు మృతి

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని పాత ఊరిలో నివాసముంటున్న టిడిపి సీనియర్ నాయకులు కోట్ల రమణ బుధవారం సాయంత్రం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పరిటాల శ్రీరామ్ టిడిపి సీనియర్ నాయకుడు కోట్ల రమణ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో నాయకులు రమేష్ బాబు , ప్రభాకర్ నాయుడు , అశ్వర్థ రెడ్డి, తుమ్మల మనోహర్, తుమ్మల సూరి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి : మండల కేంద్రానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బద్రినారాయణ మంగళవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి పరిటాల సునీత, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

బాధితుడికి పరామర్శ

మడకశిర : రొళ్ళ మాజీ జెడ్పిటిసి సన్నతిమ్మప్ప అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి మాజీ జెడ్పిటిసి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, విశ్రాంత ఇంజనీర్ మల్లికార్జున, డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన సిఐలు

పుట్టపర్తి రూరల్ :జిల్లా పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్ లలో ఎస్ఐలుగా పనిచేస్తూ, సిఐలుగా ఉద్యోగోన్నతి పొందిన వారు ఎస్పీ మాధవ్ రెడ్డిని గురువారం ఆయన కార్యాలయంలో మర్యాద పుర్యకంగా కలిశారు. ఈ సందర్భంగా ముదిగుబ్బ హేమంత్ కుమార్, కియా పోలీస్ స్టేషన్ వెంకటరమణ , బత్తలపల్లి వెంకట శ్రీహర్ష ఎస్పీ కి పుష్పగుచ్చాలు అందజేశారు.

ఓటుహక్కుపై అవగాహన

పుట్టపర్తి రూరల్: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి పౌరునికి ఓటు హక్కును కల్పించాలని, ఓటర్ నమోదుకు వారికి అవగాహన కల్పించాలని ఆర్డీవో భాగ్యరేఖ సూచించారు. ఓటర్ల జాబితా పరిశీలన సర్వే నిర్వహణలో భాగంగా వారంతపు సమావేశాన్ని స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో భాగ్యరేఖ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశంఒల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వార్డు అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

గుడిబండ : మండలంలోని గునేమోరుబాగల్ పంచాయతీ 10 వార్డ్ ఉప ఎన్నిక స్థానానికి తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థి నరసింహప్పకు మద్దతుగా నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నరసింహప్పను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు పార్థసారథి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ మద్దనకుంటప్ప తదితరులు పాల్గొన్నారు.

సిఐకు సన్మానం

కదిరి టౌన్ : ముదిగుబ్బలో ఎస్ఐ జె.హేమంత్ సిఐగా ఉద్యోగోన్నతి పొందారు.దీంతో కదిరి వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు కదిరిలోని ఆయన నివాసంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు సైదాపురం రమణ, సంపంగి గోవర్ధన్, గంగరాజు, రామాంజినేయులు పాల్గొన్నారు.

పంటనమోదు తప్పనిసరి

తలుపుల : తలుపుల -3 , పెద్దన్నవారిపల్లి, వేపమనిపేట, ఈదులకుంట్ల పల్లి గ్రామాల్లో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని ఏవో షాదాబ్ గురువారం పరిశీలించారు. పంటనమోదు చేయించుకోవాలని కోరారు.

పారదర్శకంగా పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి : మండలంలో చేపట్టే పంటకోత ప్రయోగాలను పారదర్శకంగా చేపట్టాలని ఏడీఏ క్రిష్టయ్య, ఎఎస్ఒ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ వ్యవసాయ సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి ఓబిరెడ్డి అధ్యక్షతన పంటకోత ప్రయోగాలపై శిక్షణా తరగతులను వ్యవసాయ సిబ్బందికి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది బత్తలపల్లి మండలంలో వేరుశనగ, కంది, ఆముదం, వరి పంటలకు పంటకోత ప్రయోగాలను నిర్వహించాలన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో ఉపేంద్ర, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

పెనుకొండ : పట్టణంలోని శాఖా గ్రంథాలయాన్నిజిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి సంబందించిన పలు రికార్డులు పరిశీలించారు. గ్రంథాలయ పన్ను వసూలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.మహబూబ్ బాషా, పాఠకులు పాల్గొన్నారు.